


EVENING EDITION


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
23-01-2026
పేజీలు: 02


# నేను ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టి భయపడను



సింగరేణి కుంభకోణం వెలికి తీయడంతో తెరపైకి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మొన్న హరీశ్‌రావుకు, నిన్న నాకు సిట్ నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. నైనీ బ్లాక్ కుంభకోణాన్ని బయటపెట్టినందుకే నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరయ్యేందుకు వెళ్లే ముందు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వాన్ని కూలగొట్టాలని రూ.50 లక్షలతో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అలాంటి దొంగ ఇవాళ ముఖ్యమంత్రి అయ్యి కూర్చున్నాడని అన్నారు. సింగరేణిలో రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి టెండర్ల గురించి హరీశ్‌రావు ప్రెస్మీట్ పెట్టారని..అదే సాయంత్రం హరీశ్‌రావుకు సిట్ నోటీసులు పంపించారని తెలిపారు. బామ్మర్ది బాగోతం బయటపడగానే నోటీసులు ఇస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అనే దొంగ.. తనకు తెలియకుండానే దొరికిపోతాడని తెలిపారు. బామ్మర్ది కాంట్రాక్ట్ రద్దు అయినందుకే రేవంత్ కక్షపూరిత కుట్రలకు పాల్పడుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. మేం తప్పు చేయలేదు.. భయపడమని అన్నారు. రేవంత్ రెడ్డి జేజమ్మలకు కూడా భయపడమని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ లేదని.. మాకు ఏం సంబంధం లేదని తెలిపారు. పదిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని చెప్పారు. అటెన్షన్ డైవర్షన్ కోసమే ఈ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విచారణకు వెళ్తానని.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం తపన్పు చేసిందో.. అసలు ఎక్కడ తప్పు జరిగిందో వాళ్లు సమాధానం చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి అడుగులకు మడుగులొత్తే వాళ్లను వదిలిపెట్టమని హెచ్చరించారు. చట్టాన్ని గౌరవిస్తాం.. మీరు ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తామని తెలిపారు. మా గురి అంతా ప్రభుత్వ అసమర్థత, అవినీతిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న లుచ్చా పనులను ఎండగడతామని అన్నారు. కేసీఆర్ సైనికులుగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నాలుగు కోట్ల ప్రజలను నయవంచన చేసిన ముఖ్యమంత్రిని వదలమని అన్నారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేంతవ రకు మేమంతా కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. కేసీఆర్ మేనిఫెస్టోలో పెట్టని పథకాలను కూడా అమలు చేశారని తెలిపారు. రైతుబంధు, కల్యాణ లక్ష్మీ, కేసీఆర్ కిట్ ఇలా ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేశఆమని తెలిపారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే సత్తా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. అందుకే స్కాంల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే కాళేశ్వరం, గొర్రెల స్కామ్, ఫార్ములా ఈ కేసు, ఫోన్ ట్యాపింగ్ అంటూ కేసులు పెడుతూ డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. మేం ఎలాంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. లేని దిక్కుమాలిన వార్తలు రాసి నా వాళ్లను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నా అంతరాత్మ సాక్షిగా చెబుతున్నా.. ఏనాడూ అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. గత ఏడెనిమిది ఏండ్లుగా తన వ్యక్తిత్వ హననం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. డ్రగ్స్ కేసులతో సంబంధాలు ఉన్నాయని, హీరోయిన్లను బెదిరించారని వార్తలు రాయించారని తెలిపారు. మళ్లీ హీరోయిన్ల ఫోన్లు ట్యాఫ్ చేయలేదని మీరే వార్తలు రాయించారని అన్నారు. దీనంతటికీ ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ జరగడం లేదని డీజీపీ చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రతి ప్రభుత్వంలో గూఢచారి వ్యవస్థ ఉంటుందని తెలిపారు.



## గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు

### కేసులో ఫిబ్రవరి 5న తుది తీర్పు

గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ కేసులో తుది తీర్పును ఫిబ్రవరి 5వ తేదీన వెల్లడించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని, అందువల్ల వాయిదా వేస్తున్నట్లు కోర్టు పార్టీలకు తెలియజేసింది.ఈ అప్పీళ్లపై గత డిసెంబర్ 31న వాదనలు ముగించిన ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసింది. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకన ప్రక్రియలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ నమవరపు రాజేశ్వర్ రావు సెప్టెంబర్ 9న ఫలితాలు, ర్యాంకుల జాబితాను రద్దు చేశారు. జవాబు పత్రాలను మ్యాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లోగా పరీక్షను తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించారు.సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఎంపికైన కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో సవాలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది.

## జెలెన్‌స్కీతో సమావేశమైన ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్విట్జర్లాండ్ రాజధాని దావోస్‌లో రెండో రోజు పర్యటనలో భాగంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో గురువారంనాడు సమావేశమయ్యారు. ప్రధానంగా రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగింపు కోసం ప్రతిపాదించిన 20 పాయింట్ల శాంతి ప్రణాళికపై ఉభయులూ చర్చించనున్నారు. ఇందులో భాగంగా జెలెన్‌స్కీ గురువారం ఉదయమే స్విట్జర్లాండ్ చేసుకున్నారు. ట్రంప్‌తో సమావేశం అనంతరం ఆయన దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో ప్రసంగిస్తారు.రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో గురువారం కానీ శుక్రవారం కానీ సమావేశమవుతాయని కూడా ట్రంప్ ఇంతకుముందు తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం అతి చేరువలో ఉందన్నారు.

## లెవల్ క్రాసింగ్ వద్ద ట్రక్కును ఢీకొన్న రైలు.. తప్పిన పెను ప్రమాదం



జార్ఖండ్‌లో పెను ప్రమాదం తప్పింది. దేవఘడ్ జిల్లాలోని ఓ రైల్వేక్రాసింగ్ వద్ద.. ట్రక్కును రైలు ఢీకొన్నది. నవాది రైల్వే క్రాసింగ్ వద్ద ఈ ఘటన జరిగింది. గోండా-అసన్‌సోల్ ఎక్స్‌ప్రెస్ వెళ్తున్న సమయంలో లెవల్ క్రాసింగ్ వద్ద గేటు తెరిచి ఉన్నది. ఆ గేటు నుంచి వెళ్లేందుకు ప్రయత్నించిన ట్రక్కు.. ట్రాఫిక్ వల్ల పట్టాలపైనే ఉండిపోయింది. అయితే అదే టైంలో వస్తున్న రైలు ఆ ట్రక్కును ఢీకొన్నది. ట్రక్కును ఢీకొన్న తర్వాత రైలు ఆగిపోయింది. ట్రక్కు పక్కన ఉన్న బైకర్లు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రైల్వే క్రాసింగ్ వద్ద భారీగా ట్రాఫిక్ ఉండడం వల్ల ట్రక్కు వెళ్లలేకపోయినట్లు రైల్వే అధికారులు చెప్పారు. ఈ ప్రమాదం వల్ల జైసిద్-అసన్‌సోల్ మార్గంలో రెండు గంటల పాటు రైలు ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టినట్లు అసన్‌సోల్ రైల్వే డివిజన్ ప్రతినిధి తెలిపారు. ప్రమాదంలో ధ్వంసమైన రైలు ఇంజిన్‌ను అక్కడ నుంచి తొలగించారు.





## ఆర్‌సీబీజట్టుని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ప్రముఖ ఫార్మా సంస్థ

ప్రముఖ ఫార్మా సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈఓ అదర్ పూనావాలా, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రస్తుత ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఆర్‌సీబీ యాజమాన్యం కోసం బలమైన, పోటీతో కూడిన బిడ్ వేయనున్నట్లు ఆయన గురువారం తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. కరోనా మహమ్మారి ప్రపంచ మానవాళికి పెను ముప్పుగా మారిన తరుణంలో... 'కొవిషీల్డ్' వ్యాక్సిన్ తయారీతో అదర్ పూనావాలా 'వ్యాక్సిన్ ప్రిన్స్' గా పేరుపొందడం తెలిసిందే. అలాంటి బయో సైన్సెస్-వ్యాపార దిగ్గజం కూడా ఐపీఎల్ ఫ్రాంచైజీ రేసులోకి దిగడం మరింత ఆసక్తి కలిగిస్తోంది.గతేడాది నవంబర్‌లోనే ఆర్‌సీబీ మాతృసంస్థ అయిన యునైటెడ్ స్పిరిట్స్‌కు చెందిన డయాజియో, జట్టును అమ్మకానికి పెట్టింది. ఇది తమ ప్రధాన ఆల్కహాల్ వ్యాపారంలో భాగం కానందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ పేర్కొంది.

## భారత్-యూరప్ మధ్య సంబంధాలు బలోపేతం అవ్వాలి



భారత్‌తో బలోపేతమైన కొత్త అజెండా అమలు చేయడానికి యూరోపియన్ యూనియన్(EU) సిద్ధంగా ఉందని ఈయూ విదేశాంగ విధానం, భద్రతా విధానాల హై రిప్రెజెంటేటివ్ కాజా కల్లాస్ ప్రకటించారు. యూరోపియన్ పార్లమెంట్‌లో ఆమె మాట్లాడుతూ.. భారత్-యూరప్ ఆర్థిక స్థిరత్వానికి ఇది అత్యంత ఆవశ్యకమన్నారు. భారత్‌తో కొత్త సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ పార్ట్‌నర్‌షిప్‌పై ఈయూ అంగీకరించిందని కల్లాస్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఒప్పందం సముద్ర భద్రత, కౌంటర్ టెర్రరిజం, సైబర్ డిఫెన్స్ వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరిస్తుంది. ఈ ఒప్పందం మీద వచ్చే వారం న్యూఢిల్లీలో జరిగే 16వ EU-ఇండియా సమ్మిట్‌లో సంతకం చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.





బాసరలో వసంత పంచమి వేడుకలు..

## భక్తుల రద్దీ

నిర్మల్ జిల్లాలోని బాసరలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీ జ్ఞాన సరస్వతీదేవిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడానికి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున వచ్చారు. ఆలయాన్ని అందంగా అలంకరించారు. తెల్లవారుజామున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు.

## పెద్దితో ఆట పాట?


ప్రత్యేక గీతాల్లో అగ్ర కథానాయికలు భాగం కావడం ఇప్పుడు పరిపాటిగా మారింది. దాదాపు అన్ని భాషా చిత్రాల్లో ఇదే ట్రెండ్ కనిపిస్తున్నది. కేవలం మూడునాలుగు రోజుల కాల్షీట్‌కే భారీ రెమ్యునరేషన్స్ పొందే వీలుండటం, యువతలో ఆ తరహా పాటలకు ఉన్న క్రేజ్ దృష్ట్యా అగ్ర తారలు ఐటెంసాంగ్స్‌కు సై అంటున్నారు. తాజాగా ఈ వరుసలో మరాఠీ సుందరి మృణాల్ ఠాకూర్ చేరిందని తెలిసింది. తాజా సమాచారం ప్రకారం రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రంలో మృణాల్ ఠాకూర్ ప్రత్యేక గీతంలో నర్తించనుందనే టాక్ వినిపిస్తున్నది. ఇప్పటికే మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరిపారని, పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ప్రెస్టేజియస్ మూవీ కావడంతో ఈ సొగసరి ఐటెంసాంగ్‌కు వెంటనే ఓకే చెప్పిందని ఫిల్మ్‌నగర్ టాక్. భారీ హంగులతో ఈ పాటను తెరకెక్కిస్తారని తెలిసింది. ఈ పాట కోసం సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ ఇప్పటికే హుషారైన బీట్‌తో ట్యూన్ సిద్ధం చేశారని అంటున్నారు.




## భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ కూడా బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.5,400 పెరిగి రూ.1,59,710 పలుకుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.4,950 పెరిగి రూ.1,46,400 వద్ద కొనసాగుతోంది. ఇక కిలో వెండి ధర ఏకంగా రూ.20,000 పెరిగి రూ.3,60,000లకు చేరుకుంది.మరొకవైపు ఈరోజు కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి. దీనిలో భాగంగా ఈరోజు సెన్సెక్స్ 265 పాయింట్లు నష్టపోయి 81,890 పాయింట్లు వద్ద, అలాగే నిఫ్టీ 70 పాయింట్లు నష్టపోయి 25,160 పాయింట్ల వద్ద ట్రేడ్ అవుతుంది.

# త్వరలోనే రాజకీయ భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తా



లిక్కర్ స్కామ్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరైన వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేయడంతో పాటు, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారి వల్లే పార్టీకి ఈ దుస్థితి దాపురించిందని, ఆ కోటరీ మాటలు నమ్మితే జగన్ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని తేల్చిచెప్పారు.గత ఏడాది రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విజయసాయి రెడ్డి, ఆ నిర్ణయంపై యూ-టర్న్ తీసుకున్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదని, జూన్ తర్వాత తన రాజకీయ భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తానని స్పష్టం చేశారు. లిక్కర్ స్కామ్ విచారణలో భాగంగా ఈడీ అధికారులు తనను ప్రశ్నించారని, అయితే అసలు ఏపీలో లిక్కర్ స్కామ్ జరిగిందని తాను భావించడం లేదని అధికారులకు చెప్పినట్లు వెల్లడించారు. మిథున్ రెడ్డి కోరిక మేరకు శ్రీధర్ రెడ్డి కంపెనీకి సిఫారసు చేసిన మాట వాస్తవమేనని, కానీ రూ.100 కోట్లు ఏర్పాటు చేయాలని జగన్ తనతో ఎన్నడూ చెప్పలేదని ఆయన కుండబద్దలు కొట్టారు.ఈ సందర్భంగా జగన్ చుట్టూ ఉన్న కోటరీపై విజయసాయి రెడ్డి తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. "జగన్ చుట్టూ ఉన్న కోటరీ పెట్టే వేధింపులు, అవమానాలు తట్టుకోలేకపోయాను. ఆ కోటరీయే నన్ను పొగబెట్టి నెమ్మదిగా పార్టీ నుంచి బయటకు పంపించింది. కోటరీలోని కొందరు ఇప్పటికీ తింటూనే ఉన్నారు. జగన్ జైలులో ఉన్నప్పుడు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నాకు ఇప్పుడు గౌరవం లేకుండా పోయింది. ఈ కోటరీ మాటలు నమ్మడం కొనసాగిస్తే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు" అని ఘాటుగా విమర్శించారు.



## రాష్ట్ర బ్రాండింగ్‌ను ప్రోత్సహించాం

దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తన పర్యటన విజయవంతమైందని, ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ బ్రాండింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటనను ముగించుకుని గురువారం ఆయన ఈ విషయాలను వెల్లడించారు. మారుతున్న ప్రపంచ పారిశ్రామిక రంగంలోని ధోరణులను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక దిగ్గజాల దృక్పథాలను అర్థం చేసుకోవడానికి ప్రపంచ ఆర్థిక వేదిక ఒక బలమైన వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.గత మూడు రోజులుగా జరిగిన వివిధ సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయం, పర్యాటకం వంటి కీలక రంగాల్లో రాష్ట్రం సాధించిన విజయాలను, ప్రగతిని సమర్థవంతంగా ప్రపంచానికి తెలియజేశామని ముఖ్యమంత్రి వివరించారు.

## సింధు @500



స్టార్ షట్లర్ పీవీ సింధు సరికొత్త రికార్డు నెలకొల్పింది. మహిళల సింగిల్స్‌లో 500 విజయాలు నమోదు చేసిన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. గురువారం ఆమె ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రీక్వార్టర్స్‌లో 21-19, 21-18 తేడాతో లినే హోజ్‌మార్క్ (డెన్మార్క్)పై గెలిచి ఈ ఫీట్ నమోదు చేసింది. ఓవరాల్‌గా 732 సింగిల్స్ మ్యాచ్‌ల్లో సింధు 500 విజయాలు సా ధించింది. గతంలో రచనోక్, తై జు యింగ్, యమగూచి, కరోలినా, నెడెల్చెవా ఈ జాబితాలో ఉన్నారు. క్వార్టర్స్‌లో టాప్ సీడ్, వరల్డ్ నెంబర్ 4 చెన్ యు ఫీ (చైనా)తో సింధు తలపడనుంది. పురుషుల క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21-10, 21-11 తేడాతో హాంకాంగ్‌కు చెందిన జేసన్ గునవాన్‌పై గెలిచాడు. మరోవైపు శ్రీకాంత్ 11-21, 10-21 తేడాతో చౌ టియెన్ చెన్ (వియత్నాం) చేతిలో, అన్మోల్ ఖర్బ్ 21-16, 14-21, 11-21 తేడాతో ఒకుహార (జపాన్)పై ఓడారు.

## కీర్తి హాట్ లుక్స్


టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో ఎన్నో హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. చిన్న వయసులోనే తెరంగేట్రం చేసి.. ఇప్పుడు ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసింది. అయితే తన కెరీర్ మలుపు తిప్పిన ఓ సినిమా తర్వాత తనకు దాదాపు 6 నెలలు సినిమా అవకాశాలు రాలేదని చెప్పుకొచ్చింది.హీరోయిన్ కీర్తి సురేష్ ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. మలయాళీ సినిమాతో తెరంగేట్రం చేసినప్పటికీ.. తెలుగులోనే అత్యధిక చిత్రాల్లో నటించింది. తెలుగులో నేను శైలజ సినిమాతో అడుగుపెట్టిన ఆమె.. మహానటి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డ్ అందుకుంది.



## ప్రేమించి పెళ్లి చేసుకుందని చెల్లిని,ఆమె ప్రియుడిని హత్య చేసిన ఇద్దరు యువకులు

ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారం ఓ జంట ప్రాణం తీసింది. పరువు కోసం చెల్లిని, ఆమె ప్రియుడిని అతి కిరాతకంగా హత్య చేశారు ఇద్దరు యువకులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొరాదాబాద్‌లోని ఉమ్రి సబ్జీపూర్ గ్రామానికి చెందిన కాజల్, అర్మాన్ ప్రేమించుకున్నారు. ఈ విషయం కాజల్ ఇంట్లో వాళ్లకు తెలిసింది. అర్మాన్‌కు దూరంగా ఉండాలని కుటుంబసభ్యులు ఆమెను హెచ్చరించారు. అయితే, కాజల్ వారి హెచ్చరికను పట్టించుకోలేదు. అర్మాన్‌ను నిత్యం కలుస్తుండేది. కాజల్ సోదరులు దీన్ని తట్టుకోలేకపోయారు. వేరే మతం వాడితో తమ సోదరి తిరుగుతోందంటే పరువు పోతుందని భావించారు.ఈ నేపథ్యంలోనే ప్రేమ జంటను చంపాలని డిసైడ్ అయ్యారు. రెండు రోజుల క్రితం అతి కిరాతకంగా కాజల్, అర్మాన్‌ను హత్య చేశారు. తర్వాత శవాలను ఊరికి సమీపంలోని నదిలో పడేశారు. మంగళవారం ఉదయం నదిలో కొట్టుకుపోతున్న శవాలను గ్రామస్తులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నది నుంచి శవాలను బయటకు తీయించారు. మృతులను ఉమ్రి సబ్జీపూర్ గ్రామానికి చెందిన కాజల్, అర్మాన్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో కాజల్ సోదరుల ఘాతుకం బయటపడింది.ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇక, ఈ సంఘటనపై మొరాదాబాద్ ఎస్ఎస్‌పీ సత్పల్ అంతిల్ మాట్లాడుతూ.. 'కాజల్ ఇద్దరు అన్నలను అరెస్ట్ చేశాము. దర్యాప్తు జరుగుతోంది. ప్రాథమిక దర్యాప్తులో ఇది పరువు హత్యలుగా తెలిసింది. ఇంకా లోతుగా దర్యాప్తు జరుగుతోంది. ఈ దారుణానికి పాల్పడిన వారికి కఠిన శిక్ష పడుతుంది' అని అన్నారు. పరువు హత్యలతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. అప్రమత్తమైన పోలీసు ఉన్నతాధికారులు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. భద్రతా దళాలను రంగంలోకి దించారు.

## పెళ్లైన నాలుగు నెలలకే వివాహిత ఆత్మహత్య



తమిళనాడులోని విళుప్పరం జిల్లా కందమంగళం సమీపం పకిరిపాళ్యం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ప్రియాంక(30) ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఆమెకు పుదుచ్చేరికి చెందిన యువకుడితో గత ఏడాది OCTలో వివాహమైంది. అప్పటినుంచి అత్తింటివారు అదనపు కట్నం కోసం ప్రియాంకను వేధిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో తనతో సన్నిహితంగా ఉన్న ఫొటోలను SMలో పెడతానని భర్త బెదిరించడంతో బుధవారం స్కూల్ నుంచి ఇంటికి వచ్చి ఉరేసుకుని సూసైడ్ చేసుకుంది.

## సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైబర్ మోసగాళ్ల చేతిలో దారుణంగా మోసపోయాడు. సోషల్ మీడియాలో పరిచయమైన ఓ మహిళ చెప్పిన మాయమాటలు నమ్మి, నకిలీ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి ఏకంగా రూ.2.14 కోట్లు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగింది.సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం, టీఎన్‌జీవో కాలనీకి చెందిన 44 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గతేడాది డిసెంబరులో సోషల్ మీడియా ద్వారా ఓ మహిళ పరిచయమైంది. తాను స్టాక్ ట్రేడింగ్‌లో భారీగా లాభాలు గడిస్తున్నట్లు నమ్మించింది. ఆమె మాటలు విశ్వసించిన బాధితుడి చేత ఓ నకిలీ ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించింది.డిసెంబర్ 12న తొలిసారిగా రూ.31.5 లక్షలు పెట్టుబడి పెట్టగా, యాప్‌లో భారీగా లాభాలు కనిపించాయి. దీంతో మరింత పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ లాభాలు వస్తాయని ఆ మహిళ ఆశ చూపింది. ఆమెను నమ్మి రెండోసారి రూ.42.27 లక్షలు బదిలీ చేశాడు. ఆ తర్వాత లాభాలను విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, వచ్చిన లాభంలో 30 శాతం పన్ను యూఏఈ ప్రభుత్వానికి కట్టాలని మోసగాళ్లు మెలిక పెట్టారు.యాప్‌లో కనిపిస్తున్న వర్చువల్ లాభాలను నిజమని నమ్మిన బాధితుడు, ఆఫీసు సహోద్యోగుల నుంచి రూ.90 లక్షలు అప్పు తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల నుంచి డబ్బు సేకరించి, కొన్ని ఆస్తులను కూడా అమ్మి మొత్తం 8 విడతల్లో రూ.2.14 కోట్లు వారికి పంపాడు. చివరకు డబ్బు విత్‌డ్రా కోసం ప్రయత్నించగా, అదనంగా మరో రూ.68 లక్షలు కట్టాలని చెప్పడంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు.వెంటనే అప్రమత్తమైన బాధితుడు, ఆ మహిళ ఫొటోను ఇంటర్నెట్‌లో వెతకగా, అది ఇన్‌స్టాగ్రామ్‌లోని వేరొకరి ప్రొఫైల్ నుంచి దొంగిలించిందని తేలింది. దీంతో తాను నకిలీ ప్రొఫైల్‌తో మోసపోయానని నిర్ధారించుకుని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తా వైఎస్ జగన్



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గురువారం కీలక ప్రకటన చేశారు. తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పిస్తే తప్ప అసెంబ్లీలో అడుగుపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. అధికార కూటమి ప్రభుత్వ అక్రమాలను, తప్పుడు పనులను సభలో ఎండగట్టాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, అప్పుడే తనకు తగినంత సమయం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్షంగా ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడానికి స్పీకర్‌కు ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. "అసెంబ్లీలో ఉన్నది ఒక్కటే ప్రతిపక్షం, అది వైసీపీ మాత్రమే. మిగతా పార్టీలన్నీ ప్రభుత్వంలో భాగస్వాములే. మరి మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా స్పీకర్ ఎందుకు అడ్డుకుంటున్నారు? ఇది ప్రజాస్వామ్యమా అని మీరు స్పీకర్‌ను ప్రశ్నించాలి" అని జగన్ అన్నారు. అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు "పని చేయకపోతే జీతం లేదు" (నో వర్క్, నో పే) విధానం అమలు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిన్న లక్నోలో జరిగిన సదస్సులో సూచించిన నేపథ్యంలో జగన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు 2024 నుంచి అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే.

ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు

కూటమి ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని జగన్ ఆరోపించారు. సంక్రాంతి జూదం, గ్రామాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలు, పైనుంచి కింది వరకు కమీషన్ల దందా నడుస్తోందని విమర్శించారు. ఇసుక ధరలు రెట్టింపు అయినా ప్రభుత్వ ఆదాయం పెరగలేదని, ఆ డబ్బు ఎక్కడికి పోతోందని ప్రశ్నించారు. అమరావతి పనుల్లో తమకు అనుకూలమైన కొద్దిమంది కాంట్రాక్టర్లకే అధిక రేట్లకు ప్రాజెక్టులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేకత గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు, సరైన సమయంలో పాదయాత్ర చేస్తామని జగన్ తెలిపారు. ఏడాది తర్వాత పాదయాత్ర చేపట్టి, మరో ఏడాది పాటు ప్రజల మధ్యే రోడ్లపై ఉంటామని పార్టీ సమావేశంలో చెప్పినట్లు ఆయన స్పష్టం చేశారు.